క్లుప్తంగా

ముగిసిన దేవేరుల కల్యాణోత్సవాలు



చివరి రోజున పూర్ణాహుతి నిర్వహిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 10 నుంచి నిర్వహించిన నగరేశ్వరస్వామి-వింధ్యావాసిని, జనార్ధన స్వామి-కోనక మాలదేవి దేవేరుల కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు పురస్కరించుకొని పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం దంపత తాంబూలాలతో పరిసమిప్తి అయినట్టు దేవాలయ సంఘ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమా వెంకట బాలాజీకుమార్ తెలిపారు. యావత్ కార్యక్రమం శైవాగమ విద్వాన చంద్రమౌళి ప్రభాకర సత్యనారాయణ శర్మ, చంద్రమౌళి మల్లీశ్వరి శర్మ బహ్మత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించినట్టు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ప్రమిదల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కల్లూరి సత్తిబాబు తెలిపారు.

ఏపీటీఎస్‌ఏ జిల్లా నూతన కార్యవర్గం



ఎన్నికైన అనంతరం నూతన కార్యవర్గం

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ అండ్ అకౌంటెంట్ సర్వీస్ అసోసియేషన్(ఏపీటీఎఎస్‌ఏ) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జిల్లా పరిషత్ సమీపంలో ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా జి. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిగా వి.అజయ్ కుమార్ యాదవ్, జిల్లా ట్రెజరర్‌గా పి.రామ్ దిలీప్, సహాధ్యక్షుడిగా ఎం.దివ్య, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి బి. శ్రీనివాసరావు తెలిపారు.

పోక్సో చట్టం చాలా పవర్‌ఫుల్

వడ్డాది: మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన శిక్షలు విధిస్తామని భీమునిపట్నం కోర్టు మెజిస్ట్రేట్ సౌజన్య హెచ్చరించారు. మండలంలోని మద్దిలో ఆదివారం న్యాయ విజ్ఞానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాటారు. చిన్న పిల్లలను లైంగిక వేధింపుల బారి నుంచి రక్షించడానికి 2012లో పోక్సో చట్టం చేశారన్నారు. పోక్స్ కేసు నమోదైతే తప్పనిసరిగా శిక్ష పడుతుందన్నారు. ఒకసారి కేసు నమోదు అయితే బాధితులు కేసు విత్‌డ్రా చేసుకోవడానికి కూడా అవకాశం ఉండదన్నారు. పోక్స్ కేసులను త్వరితగతిన తీర్పు చెపుతారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై నిఘా వేసి ఉంచాలన్నారు. పిల్లలు చెప్పిన సమస్యలను గాలికి వదిలేయకుండా పరిష్కరించాలన్నారు. నార్త్ ఏసీపీ అప్పలరాజు విద్యార్థి దశలోనే పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం బాధాకరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంట్రోల్‌లో చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్, న్యాయవాదుల సమ్మి సూరిబాబు, రామారావు, ఎంపీపీ రాంబాబు పాల్గొన్నారు.

సత్యసాయి సేవాదళ్ సభ్యులకు శిక్షణ



శిబిరంలో మాట్లాడుతున్న విశ్వనాథ్‌రెడ్డి

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యులకు ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్‌లో ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయిబాబా దివ్య అవతార శత జయంతి ఉత్సవాలు-2025 సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సేవాదళ్ సభ్యులకు శిక్షణ శిబిరం జరిగింది. ముందుగా పతాక ఆవిష్కరణ, ఓంకారం, వేదం, నామ సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంస్థ రాష్ట్ర సేవాదళ్ జాయింట్ కో-ఆర్డినేటర్ సి.విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 6 వేల గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వెయ్యి గ్రామాల్లో సేవలు చేయాలని సంకల్పించగా.. ప్రస్తుతం అనేక గ్రామాల్లో జరుగుతున్నాయన్నారు. ఆయా సేవా కార్యక్రమాల్లో సేవాదళ్ సభ్యులంతా భాగస్వాములుగా నిలవాలని కోరారు. పలువురు జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి!



వాహనాల తనిఖీలు చేపడుతున్న టూటౌన్ పోలీసులు

రోడ్డు ప్రమాదాలకు ట్రాఫిక్ నిబంధనల పట్ల నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం ఎక్కువగా కారణమవుతున్నాయి. ఇలాంటి వారిపై నూతన మోటార్ వెహికల్ చట్టంలో నిబంధనలు కఠినతరం చేసి, జరిమానాలు భారీగా పెంచారు. మార్చి 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిబంధనలపై ఇప్పటి వరకు అవగాహన కార్యక్రమాలకు ప్రాధాన్యతనిచ్చిన టూ టౌన్ ట్రాఫిక్ పోలీసులు ఇక మీదట డోస్ మరింత పెంచనున్నారు. చట్టం పటిష్ట అమలుకు సన్నద్ధమయ్యారు.

- లేకుంటే భారీ జరిమానాలు చెల్లించాల్సిందే
- మోటారు వాహన చట్టంతో జాగ్రత్త
- నగరంలో చట్టం పటిష్ట అమలుకు చర్యలు

అల్లిపురం: నూతన మోటారు వాహన చట్టాలను పటిష్టంగా అమలు చేసేందుకు నగర ట్రాఫిక్ పోలీసు అధికారులు రంగం సిద్ధం చేశారు. చాలాకాలంగా ప్రజలకు మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పిస్తూ వస్తోన్న ట్రాఫిక్ అధికారులు తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలుకు పటిష్ట చర్యలు చేడుతున్నారు. నియోజకవర్గంలోని టూటౌన్, మహారాణిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహన చోదకులపై కేసులు నమోదు చేస్తున్నారు. వాహన చోదకులు హెల్మెట్లు విధిగా ధరించాలని, లేకుంటే చర్యలు తప్పవని రవాణా, పోలీస్ శాఖల, అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటి వరకు అవగాహన కార్యక్రమాలపైనే అధిక శ్రద్ధ చూపిన పోలీస్ యంత్రాంగం, ఇక మీదట నిబంధనలను మరింత కఠినంగా అమలు చేసేందుకు సిద్ధమయింది.

భారీ అపరాధ రుసుములు

భారత ప్రభుత్వం ఇటీవల మోటారు వాహన చట్టాల్లో మార్పులు చేస్తూ నూతన చట్టాలను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టాల మేరకు నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్న రాష్ట్ర హై కోర్టు ఆదేశాలతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ చట్టాల్లోని ప్రధానమైన కొన్ని నిబంధనలు..

- మోటారు వాహనం రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుంటే రూ.300
- డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే రూ.5వేలు నుంచి రూ.10వేలు
- వాహన బీమా పత్రాలు లేకుంటే మొదటి సారి రూ.వెయ్యి, రెండవ సారి రూ.2 వేలు
- పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుంటే రూ.వెయ్యి
- మితిమీరిన వేగంతో డ్రైవింగ్ చేస్తే రూ.వెయ్యి
- హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.వెయ్యి
- మోటారు సైకిల్‌పై ముగ్గురు ప్రయాణిస్తే రూ.వెయ్యి
- రోడ్లపై రాంగ్ పార్కింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ రూ.వెయ్యి
- ప్రమాదకరంగా డ్రైవింగ్‌కు రూ.5 వేలు
- శబ్దకాలుష్యం చేస్తూ డ్రైవింగ్ రూ.వెయ్యి
- యూనిఫామ్ లేకుండా డ్రైవింగ్ ఆటోకు రూ.150, లారీకి రూ.300
- కారులో సీటు బెల్టు ధరించకపోతే: రూ.వెయ్యి
- మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేలు, న్యాయమూర్తి ఆదేశాల మేరకు జైలు శిక్ష
- అంబులెన్స్, ఫైరింజన్లకు దారివ్వకపోతే రూ.10 వేలు జరిమానా.

నిబంధనలు పాటించాల్సిందే



వాహన చోదకులు నూతన మోటారు వాహన చట్టాలను పాటించేందుకు పోలీసులతో సహకరించాలి. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నూతన చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా మైనర్ డ్రైవర్లు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నవారికి, వాహనాల డాక్యుమెంట్లు లేనివారిని హెచ్చరిస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిత్యం చేపడుతున్నాం. డ్రైవింగ్ సమయంలో వెంట వాహన పత్రాలు, హెల్మెట్ తప్పనిసరి. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు మైనర్ డ్రైవర్ల తల్లిదండ్రులకు, బీచ్‌రోడ్లో డేంజర్ డ్రైవింగ్ చేస్తున్నవారిని గుర్తించి అవగాహన కల్పిస్తున్నాం.

– శ్రీలక్ష్మి, ఎస్ఐ. టూటౌన్ ట్రాఫిక్

200 మందికి కంటి పరీక్షలు



మత్స్యకారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న విశాఖ ఐ ఆస్పత్రి వైద్యులు

మహారాణిపేట: స్థానిక ఫిషింగ్ హార్బర్ దగ్గర కొత్త జాలారిపేటలోని కమ్యూనిటీ హాల్‌లో ఏపీ మెరైన్ పోలీసు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 200 మంది మత్స్యకారులకు పరీక్షలు నిర్వహించారు. డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశాల ప్రకారం కోస్టల్ సెక్యూరిటీ పోలీసు అడిషనల్ ఎస్పీ జీబీఎస్ మధుసూధనరావు పర్యవేక్షణలో పోస్టు ఎస్‌హెచ్‌వో జి.దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నార్త్ కోస్టల్ సబ్ డివిజనల్ అధికారి జి.గోవిందరావు, ఇతర మెరైన్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్ యాదవ్ చొరవ తీసుకొని విశాఖ ఐ హాస్పిటల్ సహకారంతో మత్స్యకారులకు కళ్ల పరీక్షలు నిర్వహించారు.

మహిళల స్వయం ఉపాధికై 'మహాప్రసాద్'

దాబాగార్డెన్స్: గృహిణులకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మహాప్రసాద్ ప్రారంభించినట్టు శిరో హోమ్ ఫుడ్ సీఈవో తిలక్ వెంకటస్వామి పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో 'మహాప్రసాద్' లోగోను జూనియర్ పీసీ సర్కార్ కుమార్తెలు ముంతాజ్ సర్కార్, మొబాలి సర్కార్ చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం సీఈవో మాట్లాడుతూ ఇప్పటికే 3వేల మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జయశ్రీ, బాలీవుడ్ నటీమణులు స్నేహ షా, ప్రీతా ముంజుధర్, చైతన్య పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం



సీబీఎం 2005 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

- 20 ఏళ్ల తరువాత కలుసుకున్న పాఠశాల మిత్రులు
- సందడి చేసిన సీబీఎం పాఠశాల-2005 బ్యాచ్ విద్యార్థులు

దాబాగార్డెన్స్: ఆ పాఠశాలలో చదివిన వారంతా ఏడాదికో..రెండేళ్లకో..లేదా ఐదేళ్లకో కలుస్తుంటారు. లేదంటే వాట్సప్‌లో తరచూ విషెష్ చెప్పుకుంటారు. 20 ఏళ్ల కిందట ఆ పాఠశాలలో చదివిన విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. పాతనగరం సీబీఎం ఉన్నత పాఠశాలలో 2005లో పదో తరగతి పూర్తి చేసుకున్న వీరంతా నగరంలోని శివాజీపార్కు వేదికగా కలిశారు. పాత రోజులు గుర్తుకుతెచ్చుకున్నారు. ఎవరెవరు..ఎక్కడెక్కడ ఉన్నారు..ఏ స్థాయిలోన్నారు.. ఆరోగ్యం.. పిల్లలు.. ఉద్యోగం.. ఉపాధి..ఇలా అన్ని విషయాలు చర్చించుకున్నారు. అప్పటి అధ్యాపకులు నేర్పిన పాఠాలు..విద్యనందించిన పాఠశాల కోసం చర్చించుకుని సంబరపడ్డారు. నృత్యాలు చేశారు. కేరింతలు కొట్టారు. విద్యనందించిన గురువులను సత్కరించుకుని గురుభక్తి చాటుకున్నారు.

హోమియో, అల్లోపతితో జీర్ణకోశ వ్యాధుల నివారణ



మాట్లాడుతున్న డాక్టర్ ఆచంట చలపతిరావు

మహారాణిపేట: అల్లోపతి, హోమియో సంయుక్త వైద్యం ద్వారా జీర్ణకోశ వ్యాధులకు మెరుగైన చికిత్సను అందించేందుకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ హోమియోపతిక్, కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఒప్పందం చేసుకున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హాల్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో హోమియో, అల్లోపతి వైద్యులు పాల్గొని, వైద్య విధానంలో నూతన పోకడలను వివరించారు. శస్త్ర చికిత్సలు అవసరం లేకుండా హోమియో వైద్యంతో నివారించే విధానాలను తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు చలపతిరావు ఆచంట, మురళీధర్ నంబాడ, కె.శర్మ, సంస్థ జాతీయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.రాజేంద్ర ప్రసాద్, విశాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.రాఘవేంద్రరావు, జిల్లా కార్యదర్శి డాక్టర్ రాజా శ్రీకాంత్‌తోపాటు వైద్యులు ధవళ మూర్తి, పి.శివరామకృష్ణ, చీగటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో కేసులు

- సినిమా ప్రభావాలకు దూరంగా ఉండాలి
- విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



హాజరైన గిరిజన విద్యార్థినులు



శ్రీకృష్ణాపురంలో మాట్లాడుతున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఆలపాటి గిరిధర్

సాక్షి,పాడేరు/సీలేరు: బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో కేసులు నమోదు చేస్తామని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ హెచ్చరించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షురాలు ఎం.వి.శేషమ్మ అధ్యక్షతన పాడేరులోని శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో, సీలేరు జెడ్పీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. బాలికలపై లైంగిక దాడులకు పాల్పడే వారికి 10 నుంచి 15ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. బాలికలపై రోజురోజుకు పెరుగుతున్న అఘాయిత్యాల నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థిని గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై, పోక్సో చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.విద్యార్థులు సినిమాల ప్రభావాలకు గురి కాకుండా ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకోవాలని చెప్పారు. గిరిజన విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువులతో దేశానికే ఆదర్శంగా నిలవాలన్నారు. మనం ఏ ప్రాంతంలో ఉన్నా లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదలతో సాధన చేస్తే విజయం లభిస్తుందని తెలిపారు. న్యాయ విజ్ఞాన సదస్సులను జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షురాలు ఎం.వి.శేషమ్మ మాట్లాడుతూ గిరిజన బాలికలంతా పోక్సో చట్టంపై అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. పాడేరులో జరిగిన సమావేశంలో చోడవరం కోర్టు సబ్ జడ్జి వి.గౌరీశంకర్, అనకాపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ధర్మారావు, ఏఎస్పీ ధీరజ్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఐసీడీఎస్ సీడీపీవో సూర్యలక్ష్మి,డీఈవో బ్రహ్మాజీరావు, ఇన్‌చార్జి గిరిజన సంక్షేమశాఖ డీడీ ఎల్.రజనీ, తహసీల్దార్ త్రినాధనాయుడు, శ్రీకృష్ణాపురం హెచ్ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు. సీలేరులో జరిగిన కార్యక్రమంలో చింతపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిత్, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, సీడీపీవో ల క్ష్మి, సీఐ వరప్రసాద్, తహసీల్దార్ రామకృష్ణ, వైద్యాధికారులు మస్తాన్‌వల్లీ, హిమబిందు పాల్గొన్నారు.



సీలేరులో మాట్లాడుతున్న విశాఖ జిల్లా న్యాయమూర్తి గిరిధర్

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



బాల వికాస్ ఫౌండేషన్‌లో పొట్టి శ్రీరాములు జయంతిలో పాల్గొన్న సంస్థ సభ్యులు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జీవీఎంసీ అధికారులు



పొట్టి శ్రీరాములే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

దాబాగార్డెన్స్: అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి ఆదివారం నగరంలోని ఫిషింగ్ హార్బర్ రోడ్డులో గల బాల వికాస్ ఫౌండేషన్ ప్రాంగణంలో నిర్వహించారు. వాసవీ క్లబ్ గ్రేటర్ విశాఖ కపుల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ రజని, బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి, క్లబ్ సభ్యుడు నరవ ప్రకాశరావు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజని మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, శ్రీరాములు జీవిత చరిత్ర బాలలకు తెలపాలన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బాలలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాలకు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్, రూపవాణి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో అమరజీవికి ఘన నివాళి

ఆంధ్ర రాష్ట్ర అవతరణకై ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు జయంతిని జీవీఎంసీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎస్ హరేందిరప్రసాద్ ఆదేశాల మేరకు జీవీఎంసీ వ్యయ పరిశీలకుడు సి.వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి ఉద్యోగులతో కలిసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన పొట్టి శ్రీరాముల త్యాగనిరతిని గుర్తుచేశారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు గాంధీ చూపిన సత్యం, అహింస మార్గాల్లో కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. సామాజిక న్యాయం, దళితుల అభ్యున్నతికి నిబద్ధతతో పనిచేశారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఆఫీస్ ఇన్‌చార్జ్ ఆనంద్, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు

మహారాణిపేట: విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయంలోని సీఈవో చాంబర్‌లో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ఆయన ఆశయాలను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. .

కేజీహెచ్‌లో..

కింగ్ జార్జ్ ఆస్పత్రి(కేజీహెచ్)లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అమరజీవి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. శ్రీరాములు చేసిన త్యాగాలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్, నర్సింగ్ సిబ్బంది, మినిస్టీరియల్, 4వ తరగతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్స్

పట్టించుకోని జీవీఎంసీ సిబ్బంది



సింహాలదేవిడి పాల డబ్బా వద్ద తెరుచుకున్న మ్యాన్‌హోల్‌పై ప్రమాదకరంగా ఉన్న సిమెంట్ పలక




రేణుక యల్లమ్మ ఆలయం వద్ద రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ క్యాన్



రాయి జారిందా.. బతుకు గోవిందా..(సింహాల దేవిడి వద్ద మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన రాళ్లు)

అల్లిపురం: రోడ్డు మధ్యలో తెరుచుకుని ఉన్న మ్యాన్‌హోల్స్ వల్ల జరిగే ప్రమాదం ఊహించలేనిది. మెయిన్‌రోడ్డు, రోడ్డు మలుపుల్లో ఉండే వాటి వల్ల మరింత ప్రమాదం. అల్లిపురం, 32, 34 వార్డుల పరిధిలో పలు చోట్ల తెరుచుకున్న మ్యాన్‌హోల్స్ ప్రమాదలకు నెలవుగా మారాయి. స్థానికులు వాటిపై హెచ్చరికగా ప్లాస్టిక్ బాక్సులు, సిమెంట్ ఇటుకలు, సిమెంట్ పలకలు పెట్టి తమ వంతుగా ప్రమాద నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది మాత్రం వాటని చూసీ చూడనట్లుగా వదిలేయటంపై వాహన చోదకులు, పాదచారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ సిబ్బంది, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఫాల్గుణ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో అమ్మవారిని పూజారమ్మ విజయమ్మ ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పులఖండ శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50ల ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

హోటళ్లు, రిసార్టుల యజమానులతో సీఐ భేటీ



హోటళ్ల యజమానులతో మాట్లాడుతున్న ఆనందపురం సీఐ వాసునాయుడు

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో సీఐ చింతల వాసునాయుడు ఆదివారం మండలంలోని హోటళ్లు, రిసార్టులు, లాడ్జీల యజమానులతో సమావేశం అ య్యారు. ఇటీవల నేరస్తులు లాడ్జీలు, రిసార్టులను అడ్డా చేసుకుని పాల్పడుతున్న అసాంఘిక కార్యకలాపాలను ఉదహరించారు. బయట వ్యక్తులు అద్దెకు వచ్చినప్పుడు వారి నుంచి పూర్తి సమాచారం సేకరించాలన్నారు. ఐడెంటిటీ కార్డులు, ఆధార్ కార్డులు, ఫొటోలు, ఫోన్ నంబర్లు భద్రపరచాలన్నారు. అద్దెకు దిగేవారు అసాంఘిక కార్యకలాపాలైన పేకాట, వ్యభిచారం వంటివి నిర్వహించకుండా యజమానులే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా వ్యక్తులపై అనుమానం కలిగితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను సావధానంగా విన్నారు. వారి ఫోన్ నంబర్లు తీసుకుని పోలీస్ స్టేషన్, సిబ్బంది నంబర్లు వారికి ఇచ్చారు.